## విమాన ప్రమాద ఘటనపై విచారణ జరిపించాలి

హిమాయత్ నగర్, జూన్ 13: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన పై సమగ్ర మైన విచారణ జరిపిం చాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూ రు ధర్మేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.విమాన ప్రమాద ఘటన మృతులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అహ్మ దాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గాట్విక్‌కు వెళ్తున్న ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం AI-171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయి సిబ్బందితో సహా 241మంది చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు.ఇంత పెద్ద ఘటన జరగడం భారతదేశాన్ని కాకుండా యావత్తు ప్రపంచాన్ని విషాదంలో ముంచిందని తెలిపారు.

## ప్రాణదాతలుగా మారుదాం...



హిమాయత్‌నగర్ ,జూన్13: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణగూడలోని బీజేఆర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో రక్తదాన శిబిరం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో రక్తకణాల ఉత్పత్తి పెరగడంతో పాటు క్యాన్సర్, గుండె జబ్బులు సైతం తగ్గేఅవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కలువాయి శ్రీనివాస్ రావు, అధ్యాపకులు ప్రొఫెసర్ హరిబండి శ్రీనివాస్ రావు, డాక్టర్ రాపోలు శ్రీనివాస్, సీవీఎల్ నారాయణ, వై.ఉమా సూర్యకుమారి, డాక్టర్ గంగాధర్,డాక్టర్ మనోజ్ కుమార్, అరుణ, డాక్టర్ సి.రాజేశ్వర్, ఇ.ఎం. సునీత, గిరిధర్, పండరినాథ్, భిక్షపతి పాల్గొన్నారు.

### డ్రైనేజీ ఓవర్‌ఫ్లోపై చర్యలు తీసుకోవాలి

సికింద్రాబాద్, జూన్ 13: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడిబావి పరిధిలోని జై భవానీ ఆలయం వద్ద డ్రైనేజీ తరచుగా ఓవర్ ఫ్లో అవుతుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన సీవరేజీ లైన్ గతం కంటే ఇప్పుడు పెద్ద పైప్‌లైన్ వేయాలని అధికారులకు సూచించారు.

# నిధులు మంజూరైనా పనులు ప్రారంభించరా.!

*రూ.1.17కోట్ల పెండింగ్ వర్క్స్...*

### నిధులు పక్కదారి పట్టకుండా పనులు ప్రారంభించాలి: బస్తీవాసులు



సప్తమాత దేవాలయం వద్ద ధ్వంసమైన రోడ్డు

ఖైరతాబాద్, జూన్ 13 : ఎన్నికల హామీలు..మంజూరైన పనులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇలాకలో ఖైరతాబాద్ డివిజన్‌లోని చింతల బస్తీలో రోడ్లు, డ్రైనేజీ, సీవరేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతూ రోజులు వెల్లదీస్తున్నారు.

**అన్ని పెండింగ్‌లే....**

చింతలబస్తీలోని సప్తమాత దేవాలయం వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. కొత్త రోడ్డు నిర్మాణం కోసం ఏడాదిన్నర క్రితమే రూ.45లక్షలు మంజూరయ్యాయి. కాని ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. ఎరుకల బస్తీలో రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన జీ+1 కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిలిచిపోయింది. రూ.24.50లక్షల వ్యయంతో తుమ్మలబస్తీ నుంచి రెడ్‌హిల్స్ వరకు చేపట్టాల్సిన 250 ఎంఎం డయా పునరుద్ధరణ పనులు ముందుకు సాగడం లేదు. అలాగే ఎరుకలబస్తీ, ఆర్యకటిక బస్తీ, చింతలబస్తీ, రెడ్‌హిల్స్ మీదుగా చేపట్టాల్సిన 250ఎంఎం డయా పనులు సైతం నిలిచిపోయాయి.

ఈ పనుల కోసం ఇప్పటికే రూ.17.5లక్షలు మంజూరయ్యాయి. రూ.25లక్షలు మంజూరైనా సమైక్యభవన్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం పూర్తి కావడం లేదు. మొత్తం రూ.1. 17కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగా, నిధులను పక్కదారి పట్టించకుండా త్వరితగతిన పరిష్కరించాలని బస్తీవాసులు కోరుతున్నారు.



ఫిలింనగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



శాతంరాయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం వెంకటయ్య, తదితరులు

# నాణ్యమైన విద్యను అందించాలి

### -కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్,జూన్ 13: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు చెల్లించలేక ప్రభుత్వ పాఠశాలలో చేరే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జీవన్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య**

శంషాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు శాతంరాయి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీలోని శాతంరాయి ప్రాథమిక పాఠశాలలో మొదటి సంవత్సరంలో చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలకు వెళ్లి అక్కడ డబ్బులు వృథా చేసుకోకుండా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలకు కొత్తగా 45 మంది విద్యార్థులు చేరినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, కేవీ నర్సింహారావు, లక్ష్యనాయక్, సరిత, పల్లవి, నాయకులు నరేందర్, దయనంద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

శంషాబాద్ పట్టణంలోని ఆర్బినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో వేదాన్షి ఫౌండేషన్ చైర్మన్ సాయి ఆధ్వర్యంలో స్థానిక మాజీ కౌన్సిలర్ కొన్నమొల్ల భారతమ్మ చేతుల మీదగా బ్యాగులు, బాక్సులు, పెన్నులు, తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొన్నమొల్ల శ్రీనివాస్, పరంధాములు,సంస్థ ప్రతినిధులు యాదయ్య, సురేష్, మహేష్, పాఠశాల హెచ్‌ఎం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


**శంషాబాద్ మండలంలో**

మండలంలోని పెద్దషాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు దార బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, పెన్నులు, పంపిణీ చేశారు కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ విజయలక్ష్మి,ఉపాధ్యాయులు మృధులత,అశ్విని,అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దషాపూర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, టీచర్లు అనురాధ,జ్యోతి,మమత, పంచాయతీ కార్యదర్శి యాదయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో రోడ్డు విస్తరణ తగ్గించాలి

### మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన గొల్లపల్లి వాసులు



రోడ్డు విస్తరణ తగ్గించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గొల్లపల్లి గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, జూన్ 13 : గొల్లపల్లిలో రోడ్డు విస్తరణ తగ్గించాలని కోరుతూ శుక్రవారం గొల్లపల్లి మాజీ సర్పంచ్ జిట్టె సిద్ధులు ఆధ్వర్యంలో గ్రామస్తులు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంషాబాద్ పట్టణంలోని హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి కిషన్‌గూడ నుంచి గొల్లపల్లి మీద గా పెద్దగోల్కొండ ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. అందులో గొల్లపల్లి గ్రామం వరకు 100ఫీట్లు కాకుండా 40 నుంచి 50 ఫీట్ల వెడల్పు వరకు మాత్రమే పెంచాలని కోరారు. . ప్రస్తుతం 20 ఫీట్ల వెడల్పు మాత్రమే ఉన్న రోడ్డు 50 ఫీట్ల వరకు పెంచినా ఇండ్లు పెద్ద ఎత్తున కోల్పోతారని చెప్పారు. ఇండ్లు కోల్పోయిన వారికి తగ్గిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు గణేష్, బాల్‌రాజ్‌గౌడ్,ప్రవీణ్, గణేష్‌గౌడ్‌లతో పాటు పలువురు ఉన్నారు.

# ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపాలి

### తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు

ఖైరతాబాద్, జూన్ 13 : తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుపాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు కోశిక శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం సంఘం బైలాస్‌కు విరుద్ధంగా జనరల్ బాడి సమావేశం నిర్వహించకుండా, అందరికీ సభ్యత్వ నమోదు పుస్తకాలు ఇవ్వకుండా తనకు అనుకూలంగా ఉన్న కొందరు వ్యక్తులకే ఇచ్చి నాలుగు గోడల మధ్య మండల, జిల్లా కమిటీలు వేసుకొని తానే జీవిత కాలం అధ్యక్షుడిగా కొనసాగాలనే కుయుక్తులు పన్నుతున్నాడని ఆరోపించారు. దీనిని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించగా, కురుమ సంఘానికి నోటీసులు జారీ చేసిందన్నారు. సంఘానికి సంబంధించిన ట్రస్ట్ బోర్డులో సైతం కోట్లలో అవినీతి జరిగిందని, సత్రాల నిర్మాణంలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటి ఆదాయ, వ్యయాలు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. ఎగ్గె మల్లేశం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా వేసుకుంటాడని, తన నియంతృత్వ పోకడలతో సంఘం అస్థిత్వానికే మచ్చతెచ్చే విధంగా చేస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు దేవర శ్రీనివాస్, దొడ్డ శ్రీనాథ్, వంశీ జక్కుల, చిల్లంపల్లి సురేశ్, రాకేశ్, శ్రీనివాస్, రామ్‌గోపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.




*నివాళి: విమాన ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు.అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కొమురయ్య, విజయ్‌కుమార్, కిరణ్‌చారి, నల్లింగ్ రమేష్, జి.రాజు, సోల్కర్‌రెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, ఎస్.వాసు, శశికాంత్‌శర్మ, ఉమా, సతీష్, శ్రీను, విజయ్, స్వామి, సాయియాదవ్, శేఖర్‌రెడ్డి, రాము, భరత్, వెంకటేష్ పాల్గొన్నారు.– మైలార్‌దేవ్‌పల్లి*

# రూ.12 వేల ఆర్థిక సాయం అందజేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూనియన్ నేతలు

హిమాయత్ నగర్, జూన్ 13: రాష్ట్రంలో రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జీహెచ్ ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలో కొత్తగా ఆటో రిక్షా పర్మిట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసిన సందర్భంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి. వెంకటేశం, నేతలు వి. మారయ్య, రామకృష్ణ (బీఆర్‌టీయూ), ఖాజా భాయ్ (ఏఐటీయూసీ) వి.ప్రవీణ్, లింగం గౌడ్ (టీయూసీఐ) మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్, మారయ్య మాట్లాడుతూ ఆటోను నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న ఆటో కార్మికుల బతుకులు ఇబ్బందికరంగా మారాయని, నిత్యావసర వస్తువుల ధరలతోపాటు ఇంటి అద్దె, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వంద శతం పెరిగాయన్నారు.ప్రభుత్వం తక్షణమే ఆటో మీటర్ చార్జీలు పెంచి, ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఓలా, ఊబర్, రాపిడిల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించాలని వారు మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందించి ముందు రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి మిగితా సమస్యలు సైతం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



*అభివృద్ధి పనులు ప్రారంభం: రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ప్లే గ్రౌండ్ లో రూ. 30 లక్షలతో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేటర్ సీ ఎన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మైదానంలో భూమి పూజ నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్లే గ్రౌండ్ ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్, జూన్ 13*

# వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూడాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 13: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బంజారా కాలనీ ప్రజల విజ్ఞప్తి మేరకు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ లైన్ లేకపోవడం, అదే విధంగా మట్టి రోడ్డు ఉండడంతో వరద నీరు చేరుకొని చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లోతట్టు ప్రాంతం కావడంలో వరద నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరుతుందన్నారు. వరద నీరు వెళ్లే విధంగా లైన్ నిర్మించడానికి పూర్తి స్థాయి ప్రణాళికలు చేయాలన్నారు. నూతన పైపులైన్ మ్యాచ్ అయ్యే విధంగా దానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ బోర్డు డీజీఎం రేణుక, సూపర్‌వైజర్ ప్రసాద్, జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, చందునాయక్, ఎల్‌వీ రెడ్డి, తలారి చిన్న, మన్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, శంకర్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది శేఖర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎస్సైలు బదిలీ

హిమాయత్ నగర్,జూన్ 13: నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్సైలు బదిలీ అయ్యారు. ఎస్సై వెంకటేశ్ ఐఎస్ సదన్ పీఎస్‌కు ,ఎస్సై షఫీ బేగంపేట పీఎస్ కు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఫిలింనగర్ పీఎస్ నుంచి జె.శ్రీకాంత్ రెడ్డి , ఈస్ట్ జోన్ ఉమెన్ పీఎస్ నుంచి బీఎస్. శ్రీవాణి, డి.ఎస్. రాజు రానున్నారు.



*ప్రోత్సాహం: మాసబ్ ట్యాంక్ రెడ్ క్రాస్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో సోషల్ సబ్జెక్టులో 91 మార్కులు సాధించిన క్రిస్టి ప్రాన్సిస్కాను శుక్రవారం టీచర్ అపర్ణ, హెచ్ ఎం సుమిత్ర ట్రోఫీని అందించి అభినందించింది. పదో తరగతి పరీక్షలలో తన సబ్జెక్టులో ఉత్తమ మార్కులు సాధించిన వారిని ప్రతి ఏడాది ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేస్తానని టీచర్ అపర్ణ తెలిపారు. – జూబ్లీహిల్స్*

## లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్‌ఎల్బీ, మూడేళ్ల ఎల్‌ఎల్బీ ఆనర్స్ కోర్సుల రెండు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్, మొదటి, ఐదో సెమిస్టర్ ఇంప్రూవ్మెంట్, ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్‌ఎల్బీ, ఐదేళ్ల బీకాం ఎల్‌ఎల్బీ కోర్సుల రెండు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్, ఇంప్రూవ్మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 5వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

# ఆరంభంలోనే..విద్యార్థుల తిప్పలు

### వర్షం నీటితో పాఠశాల ఆవరణ ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు, విద్యార్థులు



నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేరిన వరద నీరు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 13: పాఠశాలల పున:ప్రారంభంలోనే ప్రభు త్వ పాఠశాలల విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. రెండో రోజు విద్యార్థులు పాఠశాలలకు వస్తుండగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణ మొత్తం చిన్నపాటి కుంటను తలపిస్తున్నది. దీంతో పాఠశాలల్లోకి ప్రవేశించేందుకు సైతం వీలులేకుండాపోతుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున:ప్రారంభమైయ్యాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పాఠశాల గ్రౌండ్ పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. పాఠశాల గదులకు వెళ్లి పాఠాలు బోధించాలంటే ఇబ్బందికరంగా ఉందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, ఉపాధ్యాయులు మహేశ్వర్, లక్ష్మీ, యాదమ్మలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకొని వరద నీటిని తొలగించి భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని కోరుతున్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

ఖైరతాబాద్, జూన్ 13 : వాహనాలు నడిపే ప్రతి పౌరుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ సూచించారు. శుక్రవారం పంజాగుట్టలోని ఏరో ఫాల్కాన్ ఏవియేషన్ అకాడమీ కార్యాలయంలో రోడ్డు భద్రతపై ఉద్యోగులకు పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామ్ ప్రసాద్‌తో కలిసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అతి వేగం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ వాడకం, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ లాంటివి ప్రాణాంతకమవుతాయమన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల వ్యక్తిగతంగా, ఇతరులకూ నష్టం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ నియమాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వాహనాలను ఫిట్‌గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధి అభియన్, ట్రాఫిక్ సిబ్బంది అయాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కంప్యూటర్ అప్లికేషన్స్ డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్ సీడీఈ) ద్వారా అందించే కంప్యూటర్ అప్లికేషన్స్ డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, అడ్వాన్స్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రివాల్యుయేషన్కు ఒక్కో పేపర్ కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 17 వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

### డీడీఎంఎస్ కోఫేమ్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీడీఎంఎస్ కోఫేమ్) లో వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్పర్సన్ డాక్టర్ వై. రమాప్రభ, సెక్రెటరీ భవాణి, ప్రిన్సిపల్ కె. విజయ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. బీఏ కర్ణాటక సంగీతం (ఫుల్ టైం), ఎంఏ కర్ణాటక సంగీతం (పార్ట్ టైం ఇన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కోర్సులలో చేరేందుకు కేవలం మహిళలే అర్హులని పేర్కొన్నారు. కర్ణాటక వోకల్ లో ఒక సంవత్సరం బ్రిడ్జి కోర్సు, డెవోషనల్ మ్యూజిక్ (సంకీర్తన)లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు, వీణ, వయోలిన్, కీబోర్డ్, ఫ్లూట్లలో ఒక సంవత్సరం సర్టిఫికెట్ కోర్సు, సౌందర్య లహరి, క్లాసికల్ డాన్స్, వెస్ట్రన్ డాన్స్, ఫోక్ డాన్స్, ఆర్ జే, వాయిస్ ఓవర్, యాక్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడింగ్, రిపోర్టింగ్, ఎడిటింగ్, డబ్బింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్లో సర్టిఫికెట్ కోర్సు, టెక్చర్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, క్యాండిల్ మేకింగ్, తంజావూర్ పెయింటింగ్, కార్టూనింగ్, డాల్స్ మేకింగ్, క్రోచెట్, స్టోరీ టెల్లింగ్ విత్ ఫ్లాష్ కార్డ్స్, బ్యూటీషియన్, హెయిర్ స్టైల్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అన్ని కోర్సుల్లో చేరేందుకు మహిళలతో పాటు పురుషులు కూడా అర్హులని వివరించారు. వీటిని ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 9441768811, 9393949415 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### బస్సు చార్జీల పెంపు ప్రజాస్వామ్య విరుద్ధం

చిక్కడపల్లి, జూన్ 13: రాష్ట్రంలో 20శాతం బస్సు చార్జీల పెంపు ప్రజాస్వామ్య విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులూ విజయ్ మల్లంగి మండిపడ్డారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్, బస్సు భవన్ వద్ద శుక్రవారం ఆప్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌సింగ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు.

## వృద్ధురాలు అదృశ్యం



చిట్టి లక్ష్మి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 13: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు కనిపించకుండాపోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధుబన్ కాలనీకి చెందిన చిట్టి లక్ష్మి(75) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. కాగా ఆమె కొడుకు అచ్చిరెడ్డికి స్థానికంగా ఓ స్క్రాప్ షాపు ఉంది. ఈ నెల 10న తన కొడుకు స్క్రాప్ దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే ఫోన్ నెంబర్ 9490617459, 8712568230, 9391279233లలో తెలియజేయాలని కోరారు.

## వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్, ఐడీ) మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) (ఐడీ, ఐ, డీ, హెచ్ఐ, ఏఎస్డీ) మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

## బీఆర్ఎస్ హయాంలోనే మెరుగైన వసతులు

అమీర్‌పేట్, జూన్ 13: బడిబాటలో భాగంగా శుక్రవారం సనత్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ, అక్షరాభ్యాసం ఘనంగా జరిగాయి. సనత్‌నగర్ కార్పొరేటర్ కొల ను లక్ష్మి దంపతులు పాల్గొన్న కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసి, చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు గుర్తుచేశారు.